విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఖైరతాబాద్, సెప్టెంబర్ 21 : సోమాజిగూడలోని రాజ్‌భవన్ హైస్కూల్‌లో విద్యార్థులకు భారత్ సేవాశ్రమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని సేవాశ్రమ సంఘం కార్యదర్శి స్వామి మునీశ్వరానందజీ మహారాజ్, సహాయ కార్యదర్శి స్వామి వెంకటేశ్వరనందాజీ మహారాజ్‌తో కలిసి విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు.

ఐదేళ్ల ఇంటిగ్రేడెట్ ఎంబీఏ పరీక్ష తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 21: ఓయూ పరిధిలో వాయిదా పడిన ఐదేళ్ల ఇంటిగ్రేడెట్ ఎంబీఏ పరీక్ష తేదీని ఖరారు చేసినట్లు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న సెలవు ప్రకటించడంతో అన్ని పరీక్ష లను అధికారులు వాయిదా వేశారు. ఈ పరీక్షలను తిరిగి వచ్చే నెల 16న నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

జూబ్లీహిల్స్,సెప్టెంబర్ 21: తాగు నీటి మెయిన్ పైప్‌లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం నీటి సరఫరా ఉండదన, ఈ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి డివిజన్-6 జీఎం ఎస్.హరిశంకర్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్ నుంచి మరమ్మతులు జరగనున్నందున జూబ్లీహిల్స్, ఫిలింనగర్, తట్టిఖాన సెక్షన్లలో నీటి సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. ఆయా సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు ఆదివారం సరఫరా సమయంలో నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు.

సమస్యల నిలయం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్

- నిధులు మంజూరైనా పూర్తికాని అభివృద్ధి పనులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 21: డివిజన్ పరిధిలో సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమైయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నామని పలు బస్తీల వాసులు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు తమ పరిధిలోనివి కావని తప్పించుకుంటున్నారని మండిపడుతున్నారు. నర్సాబాయి కుంట సమీపంలో ప్రాథమిక పాఠశాలకు కూతవేటు దూరంలో ఉన్న మురుగు నీటి కుంట నుంచి ఏండ్లుగా మురుగు ఏరులై పారుతున్నా నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. అప్పుడప్పుడూ తూతూ మంత్రంగా క్లీన్ చేసి చేతులు దులుపుకుని వెళ్తున్నారే.. తప్ప శాశ్వతంగా సమస్యను పరిష్కరించడం లేదని స్థానికులు ఆవేదనం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో కుంట నిండి ఇండ్లల్లోకి నీరు చేరుతున్నదని పేర్కొంటున్నారు. అంతేకాకుండా ప్రాథమిక పాఠశాల, ప్రైవేటు పాఠశాలలకు కూతవేటు దూరంలోనే కుంట ఉండటంతో పిల్లలకు ఏమైనా ప్రమాదం జరుగుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ప్రగతి కాలనీ నుంచి టాటా నగర్, మార్కండేయనగర్, రామకృష్ణ హిల్స్ వరకు వరద పారుతున్నది. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా వర్గభేదాలు పక్కనపెట్టి బస్తీల సమస్యలపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. బస్తీల్లో మ్యాన్‌హోల్స్ మూతలు పగిలి ప్రమాదకరంగా మారాయి. ఆదర్శనగర్‌లో శివరేజ్ లైన్ కోసం రోడ్డును తవ్వి వదిలేశారని చెబుతున్నారు. ఆదర్శనగర్‌లో నామమాత్రంగా కొన్ని పైపులు వేసి మిగతావి రోడ్లపైనే వదిలేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నర్సాబాయికుంట ప్రాంతంలో ఎరులై పారుతున్న డ్రైనేజీ నీరు

ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు

నర్సాబాయికుంట సుందరీకరణకు నిధులు మంజూరైనా పనులను చేపట్ట కుండా అధికారులు, ప్రజాప్రతినిధులు జాప్యం చేస్తున్నారు. బస్తీల్లో డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్, రోడ్లు తదితర పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి. లేనిపక్షంలో బీఆర్ఎస్ తరపున ప్రభుత్వ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం.

– ఎస్.వెంకటేశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్

కాంగ్రెస్ ప్రభుత్వం యాదవులను విస్మరించింది..

- రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు చక్రధర్‌యాదవ్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 21 : కాంగ్రెస్ ప్రభుత్వం యాదవులను పూర్తిగా విస్మరించిందని రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు చక్రధర్ యాదవ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యాదవ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాదవులకు సముచిత స్థానం కల్పించారని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లుగా పదవుల కేటాయించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యాదవులకు అవకాశం కల్పించడం లేదని, రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన తమ సామాజికవర్గం ఓట్లతో గెలిచి ఇప్పుడు చేయిచ్చారని ఆయన ఆరోపించారు. యాదవ సామాజికవర్గ నాయకులకు ఎమ్మెల్సీ, మంత్రి పదవులు కేటాయించాలని, రాజ్యసభ, కార్పొరేషన్ల పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపుతామన్నారు. సమావేశంలో శ్రీనివాస్ యాదవ్, మహేశ్, శంకర్, బి. శ్రీనివాస్, శ్రీశైలం, మదన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో అభివాదం చేస్తున్న యాదవ ఐక్యవేదిక నాయకులు

ఆధునిక చికిత్సతో క్యాన్సర్ నయం చేయొచ్చు..

క్యాన్సర్ అంటే జీవిత కాలం మందులు వాడాల్సి వచ్చేదని, నేడు ఆధునిక చికిత్స విధానాలతో వ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవచ్చని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్ డక్కన్‌లో శనివారం టీనేజ్, యంగ్ అడల్ట్ క్యాన్సర్ ఫౌండేషన్, నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగం సంయుక్తాధ్వర్యంలో జరిగిన సదస్సును డాక్టర్ బీరప్ప, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. -ఖైరతాబాద్

బెగోనియా హోమ్స్ గణనాథుడికి ఎకో ఫ్రెండ్లీ అవార్డు

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బెగోనియా హోమ్స్ సోసైటీ సభ్యులు

మణికొండ, సెప్టెంబర్ 21: మణికొండ పరిధిలోని బెగోనియా హోమ్స్ కమ్యూనిటీ అసోసియేషన్‌కు మోస్ట్ ఎకో ఫ్రెండ్లీ కేటగిరిలో ప్రతిష్టాత్మక సొసైటీ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. గణేశ్ ఉత్సవ్-24లో భాగంగా కమ్యూనిటీ పర్యావరణ అనుకూల గణనాథుడిగా బాలగోకులం నిర్వహించడంతో పాటు సంప్రదాయబద్ధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, వివిధ రకాల మహా ప్రసాద వితరణలు, భక్తిశ్రద్ధలతో వినాయకుడికి వీడ్కోలు పలకడం వంటి వాటిని పరిగణలోకి తీసుకోని గ్రేట్ గణేశ్ అవార్డ్స్-2024 సీజన్ 5ని, తెలంగాణ ప్రభుత్వ సమన్వయంతో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, భాషా సాంస్కృతికశాఖలు ఈ అవార్డును అందజేశాయి. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా సొసైటీ సభ్యులు అవార్డును అందుకున్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దు..

- పొట్టిశ్రీరాములు మనువరాలు ప్రొఫెసర్ రేవతి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రేవతి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 21: భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ఆమరణదీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు పేరుతో ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పును ప్రభుత్వం విరమించుకోవాలని పొట్టి శ్రీరాములు మనువరాలు ప్రొఫెసర్ రేవతి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం సాయంత్రం ప్రొఫెసర్ రేవతి తెలంగాణ ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిపెద్ది శంకర్‌తో కలిసి మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 50లక్షల మంది ఆర్యవైశ్యులు ఉన్నారని, రెండు రాష్ట్రాల్లో పొట్టిశ్రీరాములు పేరుతో ఉన్న ఒకే ఒక సంస్థ తెలుగు విశ్వవిద్యాలమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం.. సురవరం ప్రతాపరెడ్డి పేరును తాము వ్యతిరేకించడం లేదని, అదే సమయంలో పొట్టి శ్రీరాములు అస్తిత్వానికి నిలయంగా ఉన్న విశ్వవిద్యాలయం పేరును మార్చవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

పేరు మార్పును ఖండిస్తున్నాం..

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పునకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము ఖండిస్తున్నామని ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ అధ్యక్షుడు అమరవాది లక్ష్మినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పొట్టి శ్రీరాములు యావత్ భారత దేశం గర్వించదగ్గ నాయకుడని అన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని మహాత్మా గాంధీ ప్రశంసలందుకున్నారని, హరిజనోద్ధరణే లక్ష్యంగా వారికి దేవాలయాల్లో ప్రవేశం కోసం నాడు నిరాహారదీక్ష చేసిన త్యాగశీలి అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

చెత్తను ఖాళీ ప్రదేశాల్లో వేయొద్దు..

శివాజీనగర్‌లో చెత్త ఓపెన్ పాయింట్‌లో ముగ్గులు వేసిన సిబ్బంది

మణికొండ, సెప్టెంబర్ 21: ప్రజలు ఇంట్లోని చెత్తను రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో వేయవద్దని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా-24 కార్యక్రమంలో భాగంగా శనివారం మణికొండ 13వ వార్డు శివాజీనగర్‌లో జీవీపీ పాయింట్ వద్ద జీహెచ్ఎంసీ సిబ్బంది చెత్తను తొలగించి ముగ్గురు వేశారు. అదేవిధంగా 13వ వార్డు లక్ష్మీనగర్ బటర్‌ఫై పార్కులో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ప్రతి రోజూ ఇంటి వద్దకు వచ్చే ఆటోలకు చెత్తను అందించాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటి వాటిని పెంచాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్ యాలాల లావణ్య, శ్వేతాబాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జొన్నాడ లక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గౌతమ్ మోడల్ స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే

మణికొండ, సెప్టెంబర్ 21: విద్యార్థులను చిన్నప్పటి నుంచే అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని నార్సింగిలోని గౌతమ్ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సునీత, భరద్వాజ్ అన్నారు. శనివారం పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాండ్ పేరెంట్స్, విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనలు ఇచ్చారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల వారి తల్లిదండ్రులు, తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ భార్యాపిల్లలకు న్యాయం చేయండి..

విలేకరులతో మాట్లాడుతున్న రేణుకుంట్ల ఎల్లయ్య, బాధితురాలు నయోమి ఎలియాద

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 21: కానిస్టేబుల్ అయిన భర్త మరణాంతరం భార్యాపిల్లలకు రావాల్సిన ప్రయోజనాలను దక్కనీయకుండా చేస్తున్న ఆడపడుచులు, వారి కుటుంబసభ్యులపై చర్యలు తీసుకోవా లని తెలంగాణ క్రిస్టియన్,కన్వర్టెడ్ క్రిస్టియన్ యునైటెడ్ స్ట్రగుల్ కమిటీ సలహాదారుడు రేణుకుంట్ల ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్ కార్యాలయంలో ఆయన బాధితురాలు టి.నయోమి ఎలియాదతో కలిసి మాట్లాడారు. పిల్లి కిశోర్‌కుమార్ లాలాగూడ పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కిడ్నీలు చెడిపోవడంతో కిశోర్‌కుమార్ 2013 డిసెంబర్ 5న మృతి చెందాడని పేర్కొన్నారు. అయితే చట్ట ప్రకారం అతడి భార్య నయోమి ఎలియాద, కొడుకు,కుమార్తెలకు దక్కాల్సిన ప్రయోజనాలను ఇవ్వకుండా మామ పిల్లి రాఘవులు,అత్త సువర్ణ, ఆడపడుచులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి తగిన న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ నాయకుడు డేవిడ్ కడారి, మహిళా నేత సుహాసిని పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఖైరతాబాద్, సెప్టెంబర్ 21 :ప్రేమ్‌నగర్‌కు చెందిన డి. నూకరత్నం ఇండ్లలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నది. ఆమెకు కుమార్తె డి. లీలా సాయికుమారి(19), కొడుకు సతీశ్ ఉన్నారు. ఈ నెల 20న తల్లి పని కోసం వెళ్లిన సమయంలో కొడుకు స్కూల్‌కు వెళ్లగా, కుమార్తె ఇంటి వద్దనే ఉన్నది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన తల్లికి కుమార్తె లీలాసాయికుమారి కనిపించలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. చిత్తూరుకు చెందిన ఓ యువకుడు తన కుమార్తెతో పదిహేను రోజులుగా ఫోన్‌లో మాట్లాడుతున్నాడని, తన కుమార్తె కనిపించకపోవడానికి అతనే కారణమై ఉంటాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు.

మరోచోట వృద్ధుడు..

అదృశ్యమైన పల్లెపు ఉప్పలయ్య(ఫైల్)

ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. ఖైరతాబాద్ గాంధీ నగర్‌లో పల్లెపు ఉప్పలయ్య, ఎల్లమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 19 సాయంత్రం ఉప్పలయ్య తనకు పని ఉందంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు

యాజమాన్యాలు కార్మికులకు అండగా నిలవాలి

హెచ్ఐఎంఎస్‌డబ్ల్యూ సంస్థ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు రుద్రకుమార్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 21: పరిశ్రమల యజమాన్యాలు కార్మికులకు అండగా నిలవాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్ర కుమార్, సీనియర్ నాయకుడు భాస్కర్ అన్నారు. హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌డబ్ల్యూ సంస్థలో రాజేంద్రనగర్ సర్కిల్-11 లోని కాటేదాన్ డంపింగ్ యార్డులో బోగు శ్రీనివాస్ రెండేళ్లుగా టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, అతడు నడుపుతున్న టిప్పర్ ప్రమాదవశాత్తు వెనుకాల వస్తున్న కారుపైన పడటంతో పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. సదరు కారు యజమాని టిప్పర్ తాళాలు తీసుకోని తన కారును రిపేర్ చేయించాలని కోరాడు. ఇదే విషయాన్ని టిప్పర్ డ్రైవర్ రామ్‌కీ గ్రూప్ సంస్థకు తెలుపగా మా టిప్పర్‌ను తీసుకురావాలని వారు వేధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయం తమ దృష్టికి రావడంతో కార్మికుడిని వేధించవద్దని కోరుతూ శనివారం ఆ సంస్థ సర్కిల్ 11 జోనల్ మేనేజర్ రాజ్‌కరణ్‌సింగ్, సర్కిల్ ఇన్‌చార్జి నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీనికి వారు సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో డంపింగ్ యార్డు కార్మికులు శ్రీరాములు, ఓబులేశ్ తదితరులు పాల్గొన్నారు.

మధుబన్‌కాలనీలో పార్కు అభివృద్ధి పనులు చేపట్టాలి

ఉపకమిషనర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్, వెంకటేశ్

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 21: డివిజన్‌లోని మధుబన్ కాలనీలో పార్కు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కాలనీ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, సలహాదారులు మ్యాకల వెంకటేశ్ కోరారు. పార్కు అభివృద్ధి కోసం జీహెచ్ఎంసీ నుంచి రూ. 30 లక్షల నిధులు మంజూరయ్యాయని వెంటనే ప్రహారీ పనులను చేపట్టాలని శనివారం జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్కులో బండరాళ్లను తొలగించి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయోగకరంగా తీర్చిదిద్దాలన్నారు. త్వరలోనే పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాలనీ సభ్యులు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలి

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 21: నగరంలో బీజేపీని మరింత బలోపేతం చేసి ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరిగే అభివృద్ధిని అన్ని వర్గాల ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పి.ప్రసాద్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బాబుల్‌రెడ్డినగర్‌లో స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 21: అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్, మైలార్‌దేవ్‌పల్లి తదితర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాలు, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యేకు విన్నవించారు. దాంతో స్పందించిన ఎమ్మెల్యే బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అధ్వానంగా మారిందని, ఎక్కడ చూసిన డ్రైనేజీ నీరే కనిపిస్తుందని అధికారులను నిలదీశారు. రోడ్లు పూర్తిగా ధ్వంసమైనా పట్టించుకోకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పాడైన విద్యుత్ దీపాలను తొలగించి నూతన దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లకుండా బాక్స్ టైప్ నూతన లైన్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నిధులను మంజూరుకు కృషి చేస్తానన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రణాళిక బద్ధంగా పరిష్కరించాలని ఆదేశించారు.

కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్, ఈఈ, డిప్యూటీ ఏఈ, డిప్యూటీ ఎస్‌డబ్ల్యూఎం, ఏసీపీ, జలమండలి జీఎం, డీజీఎం, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రుద్రకాలనీలో అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దివ్య

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 21 : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భిక్షమమ్మ తెలిపారు. శనివారం శంషాబాద్ రుద్రకాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో పట్టణంలోని 15 అంగన్‌వాడీ సెంటర్లకు చెందిన పిల్లలకు వైద్య పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా బిడ్డలు ఆరోగ్యంగా ఎదుగుతారని అన్నారు. గుడ్లు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. అనంతరం నర్సాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దివ్య బరువు తక్కువ ఉన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె సంబంధ వ్యాధులతో బాధపడుతున్న పిల్లలను నీలోఫర్ దవాఖానకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మణికొండ పాఠశాలలో మాట్లాడుతున్న కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి

హైదర్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

మణికొండ, సెప్టెంబర్ 21: విద్యార్థులు సరైన మార్గంలో నడిచేందుకు ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మణికొండ మున్సిపల్ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండ మండల పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధశరథ్‌నాయక్ అధ్యక్షతన శనివారం పేరెంట్స్, టీచర్స్ సమావేశం జరిగింది. కౌన్సిలర్ పాల్గొని మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధించే పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా విని ఇంటి వద్ద చదువుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏర్పుల కుమార్, గంగాధర్, శ్రావణ్‌కుమార్, ఆరిఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

మైలార్‌దేవ్‌పల్లి : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని హైదర్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నిర్మల జ్యోతి, అత్తాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత అన్నారు. శనివారం హైదర్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానకాలంలో అంటువ్యాధులు దరిచేరకుండా చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులను సరిచేయాలి

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 21 : ఓటరు జాబితాలో తప్పులను సరిచేయాలని మండలంలోని మదన్‌పల్లి గ్రామ మాజీ వార్డు సభ్యులు శనివారం పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లి పాతతండాలో ఓటరు లిస్టులో తప్పులు ఉన్నాయని వాటిని సరి చేయాలన్నారు. ఇంటి నంబర్ ఆధారంగా వార్డుల వారీగా విభజన చేయాలని అధికారులను కోరారు. కొడుకు ఒకచోట, తండ్రి ఒక చోట కాకుండా కుటుంబ సభ్యులం దరూ ఒకే వార్డులో ఒకే చోట వచ్చేలా చూడాలని పేర్కొన్నారు.

వీధి వ్యాపారులకు విరివిగా రుణాలు

బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న యూసీడీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి

జూబ్లీహిల్స్,సెప్టెంబర్21 : జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు రుణాలు అందించి ప్రోత్సహిస్తున్నామని అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అడిషనల్ కమిషనర్ సీ. చంద్రకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందేందుకు, వ్యాపారాలను వృద్ధి చేసుకునేందుకు ఈ బ